www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 11 డిసెంబర్ 2023
5
అన్నమయ్య



నేడు యథావిధిగా 'జగనన్నకు చెబుదాం'

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

'మిషన్ ఇంద్రధనుస్సు'ను విజయవంతం చేద్దాం

డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

శిశువుల్లో, గర్భిణుల్లో వంద శాతం వ్యాధినిరోదకతను పెంచే సరికొత్త, మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని సమిష్టి కృషితో జయప్రదం చేద్దాం అని ఆదివారం అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య అన్నారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మిషన్ ఇంద్రధనుస్సుపై ఆరోగ్య సిబ్బందికి, వైద్యులకు ఒకరోజు పాటు రెండు దశలుగా శిక్షణా కార్యక్రమం ఇచ్చామని చెప్పారు. ఐదు సంవత్సరాల లోపు ప్రతి బిడ్డకూ, ప్రతి గర్భిణికీ ఇప్పటివరకు అందని అన్ని వ్యాధినిరోధక టీకాలు వేయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. మీసిల్స్, రూబెల్లా వ్యాధులను 2023 సంవత్సరం అంతానికి తరిమివేయడమే అని అన్నారు. సూక్ష్మ ప్రణాళిక వారిగా ఇంటింటికి తిరిగి జిల్లాలోని 501 సచివాలయ పరిధులలో ఆరోగ్య సిబ్బందిచే లబ్ధిదారులను గుర్తించామన్నారు. గుర్తించిన బిడ్డలకు, గర్భిణులకు మూడవ విడత ఈనెల 11 నుంచి 16 వరకు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి రౌండ్‌కు ఆరు రోజులు నిర్దేశించిన గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్లు, పోస్టర్స్ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు డాక్టర్ వైఎస్ఆర్ గ్రామ ఆరోగ్యకేంద్రాలకు, సచివాలయాలకు, అంగన్వాడీ కేంద్రాలకు పంపావ ున్నారు. ఇప్పటికే ఇంటింటి సర్వే లో 2సం లోపు వ్యాకిన్ వేసుకోవాల్సిన చిన్నారులను గుర్తించారన్నారు. .హెడ్ కౌంట్ సర్వే లో ఐదేళ్లలోపు పిల్లలకు టీకాలు పూర్తిగా అందాయా లేదా అని, గర్భిణులకు టిడి టీకాలు వేసుకున్నారా లేదా అని సర్వేలో ఇంటింటికి వెళ్లి అడిగి విచారించాలన్నారు. పిల్లలలో లెఫ్ట్ ఔట్, డ్రోపౌట్స్ వారిని గుర్తించామన్నారు. అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ వారితో వైద్య ఆరోగ్య శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, విద్య శాఖ, పంచాయతీ రాజ్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయం సాధించాలన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

రాహుకేతువులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రాష్ట్రానికి రాహుకేతువులుగా దాపురించాయని, పిసిసి మీడియా చైర్మన్ ఎన్. తులసిరెడ్డి మండిపడ్డారు. ఆదివారం పీలేరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రూ.115లక్షల కోట్లు అప్పు చేసి దేశాన్ని అప్పుల భారత్‌గా తయారు చేశారని విమర్శించారు. నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, ప్రభుత్వ రంగ సంస్థలు ఇండియా ఈజ్ ఫర్ సేల్ అంటూ అమ్మకానికి పెట్టిందని ఆరోపించారు. కేంద్రం పరిధిలో ఉన్న 14లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని అవి ఎవ్వరికి ఇవ్వలేదని అన్నారు. మోడీ ప్రభుత్వంలో 'అచ్చే దిన్' బదులు చచ్చే దినాలొచ్చాయని, 'సబ్ కా వికాస్' బదులు సబ్ కా వినాష్ జరుగుతూందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా లాంటి సంజీవినీకి పంగనామాలు పెట్టి, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీకి తిలోదకాలు ఇచ్చిందని పేర్కొన్నారు. జిల్లా స్టీల్ ప్లాంట్‌కు స్వస్తి పలికి మోడి ద్రోహం చేశారని, దుగరాజపట్నం ఓడరేవు ఊసే లేదని, పోలవరం ప్రశ్నర్థకంగా మారిందని చెప్పారు. జగన్ రెడ్డి ప్రభుత్వం పెట్రోలు, డీజిల్, నిత్యావసరాలు సామాన్య మానవులకు అందుబాటులో లేకుండా, అతనికంటే ఘనుడునిపించుకుంటున్నాడని ఎద్దేవ చేశారు. ఆయన దేశాన్ని అప్పుల పాలు చేస్తే ఈయన లక్షల కోట్లరూపాయలు అప్పుచేసి రాష్ట్రాన్ని అప్పులాంధ్ర ప్రదేశ్‌గా మార్చారని ఆరోపించారు. అలాగే రాష్ట్రాన్ని నేరాంధ్రప్రదేశ్‌గా మార్చారని, రౌడీలు రాజ్యమేలుతున్నారని, పూటకో రౌడీ, పేటలో రౌడీ తయారుచేశారన్నారు. ల్యాండ్ మాఫియా, శాండ్ మాఫియా, వైన్ మాఫియా, మైన్ మాఫియా అంటూ మాఫియా రాజ్యంగా మారిందన్నారు. విద్యుత్, ఆర్టీసీ ఛార్జీలు, ఇంటిపన్నులతో బాదుడే బాదుడు అంటూ ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ఆరోగ్యశ్రీ అనారోగ్యశ్రీగా, విద్యార్థుల పట్ల కంస మామగా తయారయ్యారని, మాట తప్పడం మడమతిప్పడం దిన చర్య అయిందని, నవరత్నాలు నకిలీ రత్నాలుగా మారాయని అన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు అల్లాభకష్, ప్రధాన కార్యదర్శి శ్రీవర్ధన్ చౌదరి, పీలేరు నియోజకవర్గ బాధ్యులు బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తేజ, మండల అధ్యక్షులు శ్రీకాంత్, మల్లికార్జున పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

సమిష్టి కృషితోనే విజయం: 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రానున్న 2024 ఎన్నికల్లో టిడిపి విజయకేతనం ఎగర వెయ్యాలంటే సమిష్టి కృషితోనే సాధ్యమవుతుందని రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చంగల్ రాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలి గ్రామ పంచాయతీలో ఉన్న చిన్నిళ్ల గారి పల్లి టిడిపి సీనియర్ నాయకులు పోలి సుబ్బారెడ్డి ఆహ్వానం మేరకు అల్పాహార విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు రాజంపేటలో టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని చర్చించుకున్నారు. అనంతరం టిడిపి సీనియర్ నాయకులు పోలి సుబ్బారెడ్డి మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతి కార్యకర్త రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ శ్రేయస్సు కోసం ఒక సైనికుడిగా పనిచేయాలని సూచించారు. అనంతరం బత్యాల చెంగల్ రాయుడును పోలి సుబ్బారెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మిట్స్' విద్యార్థికి రజత పతకం

ప్రజాశక్తి- మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో బి.టెక్ మెకానికల్ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.సాయినాథ్ నాయక్ ఆంధ్రా జోనల్ పురుషుల బెంచ్ ప్రెస్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించి ప్రతిభ కనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. రాజమహేంద్రవరంలో శ్రీ గౌతమి వ్యాయామ కలశాలలో నిర్వహించిన ఛాంపియన్‌షిప్‌లో 80 కిలోల బరువును ఎత్తి ప్రతిభ కనపరిచారన్నారు. 10వ ప్రపంచ స్ట్రెంత్‌లిఫ్టింగ్ ఇంక్లైన్ బెంచ్ ప్రెస్ ఛాంపియన్‌షిప్ 2023లో పాల్గొనేందుకు కూడా ఈ విద్యార్థి ఎంపికయ్యాడని చెప్పారు. ఈ నెల 18 నుంచి 21 వరకు లాల్‌బహదూర్ శాస్త్రి స్టేడియంలో నిర్వహించే పోటీలలో పాల్గొంటాడని ఆయన తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థిని కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల,కళాశాల ప్రిన్సిపల్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్, అధ్యాపకులు విద్యార్థులు అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రక్తదానమే మహాధానమని అమానత్ సేవా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అతావుల్లా అన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని బట్టువీధిలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 20 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రక్తం నిలువ కేంద్రాలలో రక్తం కొరత వల్ల అవసరమైన వారు ఇబ్బందులు పడుతున్నారని దీనిని దృష్టిలో ఉంచుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర శస్త్ర చికిత్సలకు రక్తం అవసరం అవుతుందన్నారు. రక్తం పాముఖ్యతను గుర్తించారు. రక్తదానం చేయడం ద్వారా ఎటు వంటి ప్రాణ, ఆరోగ్య నష్టం ఉండదని, అపాయంలో ఉన్నవారిని పరోక్షంగా ఆదుకోగలుగుతారన్నారు. రక్తదానం కార్యక్రమంలో పాల్గొని రక్తాన్ని అందించిన వారికి ప్రత్యేకంగా అభినందించారు. కరోనా విపత్కర పరిస్థితు ల్లో వివిధ సేవా కార్యక్రమాలు అమానాత్ సేవా సొసైటీ సభ్యులు ముందు ఉండి ఆదుకున్నామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్, సలీం, జాకీర్, ముజీబ్, మసూద్, ఫర్హాన్, దీప బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ప్రసాద్, సులోచన, భవ్య, రెడ్డప్ప పాల్గొన్నారు



రక్తదానం చేస్తున్న యువకుడు

వైభవంగా కార్తీక వన మహోత్సవం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు శ్రీగాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన మహోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆదివారం కార్తీకమాసం సందర్భంగా పీలేరు మండలం, శివరామపురంలోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో కార్యక్రమం అత్యంత వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, గణపతి హోమం, రుద్ర హోమం, పూర్ణాహుతి, మంగళహారతి చేశారు. స్వామివారి ఉత్సవిగ్రహాలుఉద్యా ఫణీంద్ర శర్మ ఇంటి వద్ద నుంచి ఊరేగింపుగా బయలుదేరి ఆలయానికి వచ్చారు. ఉదయం 10 గంటలకు శ్రీ భ్రమరాంబా సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. తదుపరి సంఘ సర్వసభ్య సమావేశం, కార్తీక సమారాధన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం గార్గేయ నదిలో బ్రాహ్మణ కుటుంబాలచే కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులు తెనాలి శేషగిరిరావు, తెనాలి రామ సుబ్రహ్మణ్యం, ఉద్యా ఫణీంద్ర శర్మ , ఆలూరు ఆదినారాయణ శర్మ, ఇంజేటి రఘునాథరావు, నడిగడ్డ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

11 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

మండల పరిధిలోని చెన్నముక్కపల్లిలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 11 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు నియోజకవర్గంలోని కెవి పల్లె, యర్రావారిపాలెం, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెం, సత్యసాయి జిల్లాలోని కదిరి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి కంటి వైద్యులు అందులో 11 మందికి ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 40 మంది కంటి రోగులకు ఉచితంగా అద్దాలు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లయన్ చెన్నూరు బాష కంటి వైద్యులు సురేష్ బాబు,ఆఫ్తాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, పాల్గొన్నారు.

అటవీశాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తిరుపతి సర్కిల్ పరిధిలోని అటవీ క్షేత్ర అధికారుల అసోసియేషన్ ఎన్నికలు తిరుపతి నగరంలోని ఎర్రచందనం గోడౌన్ సమావేశం మందిరంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.వి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె. మదన్మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు బి.సుదర్శన్ రెడ్డి, కార్యదర్శి ఎన్.లక్ష్మీపతి, సంయుక్త కార్యదర్శి పి.మాధవి, కోశాధికారి ఆర్.నారాయణను ఎన్నుకున్నట్లు రాజంపేట అటవీ శాఖ రేంజ్ అధికారి నారాయణ తెలియజేశారు. నూతనంగా ఏర్పడిన కార్యవర్గానికి సిసిఎఫ్ నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

21న మండలస్థాయి చెకుముకి పరీక్ష

రాయచోటి : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పరీక్ష ఈనెల 21న మండలస్థాయిలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో 8,9, 10 వ తరగతులలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులు పోటీలో పాల్గొంటారని పేర్కొన్నారు.అన్ని మండల కేంద్రాలలో పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. అన్నమయ్య జిల్లాలో 30 మండలాలలో ఈ పరీక్ష ఉంటుందని తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - మదనపల్లి

సీనియర్ సిటిజన్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కృషి చేస్తానని సీనియర్ సిటిజన్స్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు ఎన్. ముని గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక జిఆర్‌టి హై స్కూల్‌లో నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ సిటీజన్ సమస్యలు పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. సీనియర్ సిటిజన్స్‌కు ఎస్‌బిఐ ద్వారా మెరుగైన సేవలు అందిస్తామని చెప్పిన మేనేజర్ మంగళ గౌరీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆమెను దుశ్శాలవతో సన్మానించారు. సమావేశంలో రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, శకుంతలమ్మ , జగన్మోహన్, బ్యాంకు రమణ, గొల్లపూడి, రచయిత కృష్ణమూర్తి, ధనలక్ష్మి, కృష్ణ కుమార్, నాగరాజా, రామచంద్రయ్య, ప్రొఫెసర్ చంద్రశేఖర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్ కుర్చీ కోసం



కోల్డ్‌వార్!

- ఆ ఇద్దరు సీనియర్ల మధ్యే పోటీ
- మూడు గ్రూపుల మధ్య నలుగుతున్న సిబ్బంది
- తారాస్థాయికి చేరిన వ్యవహారం
- గాలికి వదిలేసిన వైద్యసేవలు

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా కేంద్రంలోని రాయచోటి ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెర్ కుర్చీ కోసం కుమ్ములాట తారాస్థాయికి చేరింది. ప్రస్తుతం పని చేస్తున్న ఇన్‌ఛార్జి డిసిహెచ్ఎస్, రాయచోటి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌ను సాగనంపడానికి ఒక పూర్వ సీనియర్ సూపరింటెండెంట్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుత సూపరింటెండెంట్ పై కొంతమంది వైద్యులు ప్రజాప్రతినిధులను ఆశ్రయించి ఫిర్యాదులు చేస్తూ ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. గతంలో ఇక్కడ పనిచేసిన సీనియర్ వైద్యాధికారి బదిలీపై వెళ్లి మూడేళ్లయ్యింది. తరువాత అతికష్టంమీద బదిలీపై తిరిగి రాయచోటి ప్రభుత్వాస్పత్రికి వచ్చి సూపరింటెండెంట్ కుర్చీపై కన్నేసి చివరికి డిసిహెచ్ఎస్ ఇన్‌ఛార్జి పోస్టుపై గంపెడు ఆశలు పెట్టుకుని పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఆయన కేవలం సంపాదన ధ్యేయంగా తన నర్సింగ్ హోమ్‌కు రోగులను రప్పించుకొని ప్రభుత్వాస్పత్రిలో గందరగోళం సృష్టిస్తున్నారనేది జగమెరిగిన సత్యం. మరో సీనియర్ వైద్యులు రెండు, మూడు నెలల పాటు బదిలీపై వెళ్లి వచ్చి సూపరింటెండెంట్ కొనసాగడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రిలో 14 మంది వైద్యులు, 18 మంది స్టాఫ్ నర్సులు పనిచేస్తున్నారు. ఈ ఆసుపత్రిలో డాక్టర్లు, నర్సులు, సిబ్బంది దాదాపు 95 మంది పని చేస్తున్నారు. వారు ఆ ముగ్గురి సివిల్ సర్జన్ల మధ్య నలిగిపోతున్నారు. దీంతో వైద్య సేవలు కుంటుపడుతున్నాయని ఆరోపణలున్నాయి. కేవలం ఆ ముగ్గురి తప్పిదాలతో రోగుల సేవలు అగమ్యగోచరంగా మారినట్లు విమర్శ ఉంది. వీరు వైద్య సేవల్లో పోటీ పడితే రోగులు, ప్రముఖులు హర్షించేవారు. వీరి చేష్టల వల్ల ప్రభుత్వ ఆసుపత్రికి చెడ్డపేరు తెస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత సూపరింటెండెంట్ పీలేరు నుంచి ఇక్కడికి బదిలీపై రాగా ఆయనపై చేడు అభిప్రాయం కల్పించేవిధంగా సీనియర్ వైద్యాధికారి వ్యూహ రచన చేస్తున్నట్లు తెలిసింది. కుల సంఘాలను పురిగొల్పి చెడు అభిప్రాయాలను లేవనెత్తించి ఆయన్ను బదిలీ చేయిస్తే తానే సర్వాధికారిగా ఉండవచ్చని వ్యూహరచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దళిత సంఘాలు, ప్రజాసంఘాలు ఆయనపై ఇప్పటికే ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు కూడా తెలుస్తోంది. ప్రస్తుత సూపరింటెండ్ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రి స్థాయికి పెంచారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యులలో పలువురికి సొంత ఆసుపత్రులు, క్లినిక్స్ పై ఉన్న ధ్యాస ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలపై శ్రద్ధ లేదని ఆరోపణలు ఉన్నాయి. సూపరింటెండెంట్ కుర్చీపై కోల్డ్ వార్ జరుగుతోంటే ప్రయివేట్ ప్రాక్టీస్ చేసుకునే వైద్యులు ఈ పోటీ పడుతున్న ప్రధాన ముగ్గురు వైద్యుల మధ్య నలిగిపోతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నామమాత్రంగా చికిత్సలు ఆపరేషన్లు చేస్తున్నారని, పలు కేసులను తమ ప్రయివేట్ క్లీనిక్‌లకు తీసుకు రావడానికి విభజించు పాలించు విధంగా వ్యవహరిస్తున్నారనేది జగమెరిగిన సత్యం.

పలువురు నర్సులు సైతం ప్రభుత్వ ఆసుపత్రిలో తమ చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. వీరి సైతం పలు కేసులను ప్రభుత్వా సుపత్రిలో పనిచేస్తున్న వైద్యుల క్లీనిక్‌లకు రెఫర్ చేస్తున్నట్లు విమర్శలున్నాయి. పేదవారు ఈ ధర్మాసుపత్రికి వివిధ జబ్బులపై, రోడ్డు ప్రమాదాలపై వస్తే వారికి తూతూ మంత్రంగా చికిత్స చేసి కడప రిమ్స్, తిరుపతి రుయా ఆసుపత్రికి రెఫర్ అంటూ చేతులు దులుపుకుంటున్నారు. వారు చికిత్స నిమిత్తం సంబంధిత ఆసుపత్రులకు చేరే లోపు వారి ప్రాణాలు అనంత వాయువులో కలిసిపోతున్నాయి. ఇక్కడ ప్రాథమిక చికిత్స చేసి చివరికి బ్లడ్ ఆగిపోవడానికి కూడా చర్యలు తీసుకోకుండా సినిమా ఫక్కీలో కట్లు కట్టి పంపుతున్నారని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. కేవలం కుర్చీ కోసం పోటీపడే శ్రద్ధ ఇక్కడ రోగులకు మెరుగైన వైద్య అందిచాలని శ్రద్ధ మాత్రం లేకపోవడం గమనార్ధం. ఇప్పటికైనా రాష్ట్ర వైద్యాధికారులు, కలెక్టర్, చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని ఆసుపత్రి సిబ్బంది, రోగులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ చంద్రశేఖర్

ఫాతిమా మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో

కుటుంబ ప్రాథమిక ఆరోగ్య దత్తత స్వీకారోత్సవం

ప్రజాశక్తి - కడప

ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వారి ఆధ్వర్యంలో ఆదివారం తాడిగుంట్ల గ్రామంలో కుటుంబ ప్రాథమిక ఆరోగ్య దత్తత స్వీకారోత్సవం, వైద్య శిబిరాన్ని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జవాద్ ఎ.క్యూ, ఎఫ్ఐఎంఎస్ ఈడి సల్మాన్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తాడిగుంట్ల ఓబుల రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి సహకరించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ శైల రేఖ, డైరెక్టర్, మెడికల్ సూపరింటెండెంట్, వైస్ ప్రిన్సిపల్, కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కళాశాల పీజీ, మెడికల్ విద్యార్థులు, ఉచిత మెడికల్ క్యాంపులో 250 మంది వైద్య సేవలు చేయించుకున్నారు.

ప్రాథమిక హక్కులతో పాటు విధులూ పాటించాలి

ప్రజాశక్తి-పీలేరు

ప్రాథమిక హక్కులతో పాటు విధులను కూడా పాటించాలని మాల మహానాడు నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు నాయకులు మాట్లాడుతూ ప్రాథమిక హక్కుల దినోత్సవంతో పాటు ప్రాథమిక విధులు పాటించాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం 1948 డిసెంబరు 10న పారిస్‌లో సమావేశమైన ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ప్రపంచ వ్యాప్తంగా పౌరహక్కుల పరిరక్షణకు ప్రతిజ్ఞ చేసిందన్నారు. అదే సార్వత్రిక మానవ హక్కుల ప్రకటనగా ప్రసిద్ధి పొందిందని వ్యక్తుల ప్రాథమిక హక్కులను నిర్వచించిన ఆ తీర్మానం మనుషులందరూ సమానులని స్పష్టీకరించిందని చెప్పారు. జాతి, వర్ణం, మతం, లింగం, భాష, పుట్టుక, సామాజిక హోదా, రాజకీయ భావాలు, అభిప్రాయాలు, ఆస్తిపాస్తులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరి హక్కులకూ రక్షణ లభించాలని అది ఉద్ఘాటిస్తోందని, మానవ హక్కుల చరిత్రలో అది ఓ మైలురాయి వంటిదన్నారు. కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల సహాయ కార్యదర్శి నగరిమడుగు సుభాష్, జిల్లా ఉపాధ్యక్షులుజెట్టి మల్లికార్జున, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ పాల్గొన్నారు. **రాయచోటి :** వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కల్గి ఉండాలని ఎపిసిఆర్ఎఫ్ సిబ్బంది దర్బార్, రవి శంకర్, విఆర్‌డిఎస్ సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో సంబేపల్లిలోని కెజిబివి ,గురుకుల పాఠశాల, దేవపట్ల గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వస్తువులు ,ఉత్పత్తులు, నాణ్యత, పరిమాణం, స్వచ్ఛత, దర గురించి తెలియజేసే హక్కు వినియోగదారుల హక్కు అన్నారు. కార్యక్రమంలో సుండుపల్లి ఈసీ నెంబర్ సిద్దయ్య ,పాఠశాలల సిబ్బంది శ్రీకల,కళావతి, పావని, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావలేశంలో మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు



కిషోర్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న స్థానికులు

సహజవనరులను కొల్లకొడుతున్న వైసిపి

- టిడిపి జాతీయ నాయకులు నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలో సహజ వనరులైన ఇసుక, మట్టి కొల్లగొట్టడంతోపాటు కొండలు, గుట్టలు, భూ ఆక్రమణలకు పాల్పడుతూ వేల కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును వైసిపి నేతలు కొల్లగొడుతున్నారని తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన పట్టణంలోని కడపరోడ్డు, తులసీ రైస్ మిల్, చెన్నారెడ్డి కాలనీ, ఎస్.వి డీలక్స్ రోడ్డు, మల్లెలవారి వీధి, తదితర ప్రాంతాల్లో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమంలో పాల్గొన్నారు. టిడిపి శ్రేణులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులతో కలిసి చంద్రబాబు మహానాడు వేదికగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను కిషోర్ కుమార్ రెడ్డి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో వెనకబడుతూ విలవిల్లాడుతోందని అన్నారు. ఆదాయం సృష్టించడం చేతకాని ముఖ్యమంత్రి ఖజానా ఖాళీ చేస్తూ చేతులు పైకెత్తేసే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఇలాంటి ముఖ్యమంత్రి ఉండడం రాష్ట్ర ప్రజల దురదృష్ట మని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలకు తావివ్వకుండా తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

'రాజకీయంగా ఎదగాలి'

ప్రజాశక్తి-పీలేరు

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు బానిస బతుకులు వీడి రాజకీయంగా ఎదగాలని విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివ ప్రసాద్ తెలిపారు. రెడ్డి, కమ్మ కులాల నాయకులు పరిపాలన సాగిస్తున్నారంటే మనం ఓట్లు వేస్తేనే వారు నాయకులుగా చలామణి అవుతున్నారని అన్నారు. ఆదివారం రూల్ ఆంధ్ర పేరుతో పీలేరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం బికెఆర్ రెసిడెన్సీలో ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీ, కాపుల రాజకీయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం నీకు ఆయుధం లాంటి ఓటు హక్కును కల్పించిందని, ఆ ఓటుతో నీ భవిషత్తును మార్చుకో అన్నారని, ఎన్నాళ్లీ బానిసబతుకులు వెనకబడిన కులాలు ఎదిగి అధికారం చేపట్టడం తప్పుకాదని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో విసికె పార్టీ తరపున పోటీ చేసి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలపైన జరుగుతున్న దాడులను అడ్డుకోవడానికి, విసికె పార్టీ బలోపేతానికి, విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గణపతి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మోహన్, విసికె పార్టీ సహాయ కార్యదర్శి పాలకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిటిఎం శివప్రసాద్


రోడ్డుపై దట్టంగా అలుముకున్న పొగమంచు

ముసురుకున్న పొగమంచు

-ఇబ్బందులు పడ్డ వాహనదారులు

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై పొగ మంచు దట్టంగా ముసురుకుంది. ఉదయం 9 గంటల పొగమంచు దట్టంగా ముసరుకోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పొగమంచు కారణంగా రోడ్డుపై వెళ్లే వాహనాలు లైట్లు వేసుకొని ప్రయాణం చేశారు.


వృద్ధురాలికి నేత్ర పరీక్ష చేస్తున్న విజన్ టెక్నీషియన్

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ మదనపల్లి వారిచే ఆదివారం బాలుర ఉన్నత పాఠశాల ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 50 మంది ప్రథమ చికిత్స హాజరు కాగా అందులో 20మందికి ఉచిత కంటే ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు విజన్ టెక్నీషియన్ సాంబశివ పేర్కొన్నార. సోమవారం మదనపల్లి ఎల్విప్రసాద్ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్ చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహేంద్ర, అనిల్, పెద్ద రాజన్న పాల్గొన్నారు.


గోవిందురామయ్య ఆధ్వర్యంలో వనభోజనానికి తరలివెళుతున్న బలిజసంఘం నాయకులు

వనభోజనానికి తరలివెళ్లిన బలిజ సంఘం నాయకులు

ప్రజాశక్తి-టి.సుండుపల్లి

కడపజిల్లాలోని చింతకొమ్మదిన్నెలో బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజనానికి మండల బలిజసంఘం అధ్యక్షులు గోవిందురామయ్య పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో టిడిపినాయకులు సుగవాసి బాలసుబ్రహ్మణ్యం, జనసేనపార్టీ నాయకులు రామ్‌శ్రీనివాస్, సానిపాయి, మాజీసర్పంచ్ నేతివెంకటరమణ, సుండుపల్లి మండల బలిజ సంఘం ఉపాధ్యక్షులు జయరామ్, ప్రధాన కార్యదర్శి చెన్నంశెట్టి రామాంజనేయులు, విశ్రాంత లెక్చరర్ ఎవి సుబ్బయ్య, రిటైడ్ యస్ఐ ఆర్.నాగయ్య, బలిజ సంఘం నాయకులు తోట రవీంద్ర పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

ప్రజాశక్తి- బి.కొత్తకోట


జైభీమ్‌నగర్‌లో మురుగు నీటికాలువ

నగర పంచాయతీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు బి.కొత్తకోట కమిషనర్ పి.ఆర్.పేర్కొన్నారు.పట్టణంలో కొన్ని వార్డులలో మురుగునీటి కాలువలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి నిర్మాణానికి ఎంపీ మిథున్ రెడ్డి నిధులను ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి మంజూరు చేయించారన్నారు. పట్టణంలోని జైభీమ్‌నగర్‌లో మురుగు నీటికాలువ నిర్మాణాలను కమిషనర్ ఆదేశాల మేరకు నాలుగో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజశేఖర్ ఆధ్వర్యంలో కాలువ నిర్మాణ పనుల పర్యవేక్షణ నిర్వహించారు.

స్వేచ్ఛ, సమానత్వమే మానవ హక్కుల ధ్యేయం

వేంపల్లె : ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అనేది ఉండడమే మానవ హక్కుల ధ్యేయమని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రామసుబ్బయ్య అన్నారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎన్ఎస్ఎస్ యూనిట్-8 ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు మానవ హక్కులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామసుబ్బయ్య మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 1948లో యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్‌ను (యూడీహెచ్ఆర్) ఆమోదించినట్లు చెప్పారు. ప్రతి ఎడాది డిసెంబర్ 10న ప్రపంచ మానవ హక్కుల దినంగా పాటిస్తున్నట్లు తెలిపారు. 1994 నుంచి దేశంలో మానవ హక్కుల పరిరక్షణ చట్టం అమలులో ఉందన్నారు. దీన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మధుసూదన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అనూష రాజ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

పులివెందుల రూరల్ : పులివెందులలోని అంకాలమ్మ పేట సచివాలయం పరిదిలో ఉన్న బాలికల వసతి గృహాన్ని ఆదివారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బాలికలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. సమస్యల గురించి తెలుసుకున్నారు. వసతిగృహంలో ఇన్వర్టర్ లేదని విద్యార్థినులు చెప్పగా.. వెంటనే స్పందించి ఇన్వర్టర్ పెట్టించే ఏర్పాటు చేస్తానని చైర్మన్ తెలిపారు. ఇప్పటి నుంచే ప్రణలికాబద్ధంగా చదువుకోవాలని, అందుకు అవసరమైన యుపిఎస్‌సి, నీట్ పుస్తకాలు వసతిగృహానికి అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కౌన్సిలర్ కొండలరావు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ బాల నారాయణ, సూపరింటెండెంట్ ఆనందరావు, శ్రీధర్, ప్రశాంతి పాల్గొన్నారు

కష్టపడితేనే గుర్తింపు

వేంపల్లె : రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కోసం పని చేయండి.. గుర్తింపు ఉంటుందని టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఉన్న చంద్రబాబును పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవి ఆధ్వర్యంలో స్థానిక శ్రీరాంనగర్‌కు చెందిన బత్తాలరమణ, భాస్కర్ కలిశారు.పార్టీ గెలుపుకు కృషి చేయాలని చంద్రబాబు సూచించారని చెప్పారు.

పాస్పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా , గాలివీడు మండలం, గాలివీడు గ్రామం, సలాదివారిపల్లెకు చెందిన గెంటెం అరుణ వయస్సు 45సం॥లు. భర్త గెంటెం బాబుకు చెందిన పాసుపోర్ట్ పోయినది. తన ఆధార్ నెం.5051 1198 8341 ఎవరికైనా లభించినచో క్రింది సెల్ నెం: **9391524441** కు ఫోన్ చేయగలరు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం :'గడికోట'

ప్రజాశక్తి-గాలివీడు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారంలో మండలంలో రూ.7.97 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపన చేశారు. వెలిగల్లు తూముకోట గ్రామ ప్రజలకు 1200 సోలార్ లాంప్ లు పంపిణీ చేశరు. శెట్టివారిపల్లి, బుడ్డిగారిపల్లిలో రూ. 18 లక్షల వ్యయంతో సిసిరోడ్లను ప్రారంభించారు. గోపనపల్లి గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అవసరమైన సిసి రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల రైతులకు విజ్ఞాన కేంద్రాలుగా మారాయని అన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు ఆర్‌బికెలో అందుబాటులో ఉంచామన్నారు. విలేజ్ క్లినిక్‌ల ద్వారా గ్రామం లోనే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నామ న్నారు. గతంలో వైద్యకోసం ఎంతో ప్రయాస పడేవారని ఇప్పుడు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు వైద్యసేవలు అందు బాటులోకి తెచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు వారి ఇంటి వద్దకే వాలంటీర్ల ద్వారా అందిస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలిచామన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైసిపి గెలుపుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి-1 మిట్టపల్లి యదుభుషన్ రెడ్డి, వైస్ ఎంపిపి-2, గాలి శ్రీనివాసులు, ఆవుల నాగభూషణ్ రెడ్డి, మైనార్టీ వైసిపి నాయకుడు ఎస్ఎ.ఖాదర్ మోదీన్, ఉమాపతిరెడ్డి, తంగాల పెద్ద వెంకటరమణ, గాలివీడు వైస్‌సర్పంచ్ తంగాల వెంకటరత్నం, తంగాల వేణుగోపాల్, ఎంపిడిఒ శేఖర్‌నాయక్, శెట్టికృష్ణ, నాగేశ్వరరావు కరిమిరెడ్డి విశ్వనాథరెడ్డి బ్రహ్మానందరెడ్డి, వెంకటయ్య, సుబ్బారెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వైసిపి నాయకులుపాల్గొన్నారు.


శ్రీకాంత్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న వైసిపి నాయకులు

రాష్ట్ర భవిష్యత్తుకు బాబు మళ్లీ రావాలి : ఆర్‌జె


ప్రచార కార్యక్రమంలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి


రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం మండల టిడిపి అధ్యక్షులు పుత్రా వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాలపై కరపత్రాలను పంచి వివరించారు. అనంతరం ఆర్.జె వెంకటేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టిడిపి ముందుగా టిడిపి అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు రూపాయలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. యువగళం పేరుతో రూ.20 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించడం జరుగు తుందన్నారు. బిసిలకు రక్షణ చట్టం తీసుకువస్తామన్నారు. ఇంటింటికి సురక్షిత మంచినీరు అందిస్తామని, మహాశక్తి పథకం ద్వారా ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ.1500లు, ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందించడం జరుగు తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. తల్లికి వందనం పేరుతో ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు రూపాయలు అందిస్తారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమిని గెలిపించి చంద్రబాబు నాయుడుని తిరిగి ముఖ్యమంత్రిగా చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె వెంకటేష్, నాయకులు పూల మురళి, జికె.వెంకటరమణ, రెడ్డప్ప, గండికోట గణేష్, మార్పూరి మహేష్, భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం

-భయం గుప్పెట్లో సిబ్బంది విధులు నిర్వహణ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు


ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం


పెచ్చులూడిన పైకప్పు


వర్షానికి తడవకుండా ఫైళ్లపై ప్లాస్టిక్ కవర్

రైల్వేకోడూరు పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో గల ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం కూలడానికి సిద్ధంగా ఉంది. ఈ కార్యాలయంలో స్లాబ్ పెచ్చులూడి ఇనుప కమ్మీలు కనబడుతున్నాయి. ఆ స్లాబ్ కిందే కూర్చుని సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో వర్షాలు నీరు స్లాబ్ నుంచి లీకై కార్యాలయంలోని ఫైళ్ళపై పడుతుండడంతో ఆ ఫైళ్లను ప్లాస్టిక్ షీట్లతో కప్పి కాపాడుకుంటున్నారు. ఏ సమయంలో కులుతుందో తెలియక భయం గుప్పెట్లో ఆ భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. వర్షపునీరు స్లాబ్‌లో నుంచి లీక్ అవ్వడం వలన కంప్యూటర్లు కూడా దెబ్బతింటున్నాయి. ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో అన్ని శాఖలకు దాదాపు నూతన భవనాలు నిర్మించారని, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు మాత్రమే నూతన భవనం నిర్మించ కపోవడం బాధాకరమని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ కార్యాలయాన్ని పరి శీలించి నూతన భవనాన్ని మంజూరు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

గిరిజన తండాలో నాకాబందీ


విలేకర్లతో మాట్లాడుతున్న సిఐ తమ్మిశెట్టి మధుబాబు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని ముసలీకుంట రెవెన్యూ గ్రామపరిధిలో గిరిజన తాండలో ఆదివారం అన్నమయ్య జిల్లా ఎస్‌పి ఉత్తర్వులు మేరకు మదనపల్లె డిఎస్‌పి ఆదేశాలు మేరకు ములకలచెర్వువు సిఐ తమ్మిశెట్టి మధుబాబు ఆధ్వర్యంలో నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈ తనిఖీల్లో ఏడు దివ్య చక్రవాహనాలు, వెయ్యి లీటర్ల సారాసారా ఊట ధ్వంసం చేసి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మధుబాబు విలేకరులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో సారా విక్రయాలు చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. గ్రామాల్లో సారా నివారణ కోసం ప్రత్యేక టీం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పెద్దమండ్యం ఎస్ఐ రామంజనేయుడు, పిటిఎం ఎస్ఐ రవీంద్ర, తంబళ్లపల్లి ఎస్ఐ లోకనాథ్ రెడ్డి, ములకల చెరువు ఎస్ఐ గాయత్రీ, ఎఎస్ఐ ఇషాక్, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

300 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం

మదనపల్లి : మదనపల్లి మండలం కోటవారిపల్లి పంచాయతీ నారమాకుల తండా గ్రామ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 300 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు సిఐశేఖర్ తెలిపారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ఎవరైన సారా తయారు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఈ గ్రామ పరిసర ప్రాంతాల్లో అనేకసార్లు తనిఖీలు నిర్వహించి వేల లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసి కొంతమందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు గుర్తు చేశారు. చాలాసార్లు కౌన్సిలింగ్ చేసి కొంతమంది ప్రవర్తనలో మార్పు తేవడంతో పాటు కొంతమందికి ఉద్యోగ కల్పన కూడా కల్పించామని తెలిపారు. కొంతమంది సారా కాంచడం వృత్తిగా కొనసాగిస్తున్నారు త్వరలో వారిని కూడా పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


గ్రామంలో ప్రజలకు సూచనలను ఇస్తున్న సిఐ శేఖర్

ఒక్క ఛాన్స్ కామెడీ షో అడిషన్స్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని శిల్పారామంలో ఆదివారం కళాకారుల కలలను నిరూపించుకునేందుకు ఒక్క ఛాన్స్ కామెడీ షో అడిషన్స్ కార్యక్రమాన్ని మా ఊరి సినిమా హీరో మహేష్, ఏపీ జీరో ఫోర్ రామాపురం సినిమా డైరెక్టర్ హేమారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ షోకు పలు జిల్లాల నుండి దాదాపు 300 మంది కళాకారులు విచ్చేశారు. న్యాయ నిర్ణేతలుగా మహేష్, వేమారెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క రూపాయి డబ్బు ఖర్చు కాకుండా, ఎలాంటి సిఫారస్ లేకుండా ప్రతిభగల కళాకారులను బయటికి తీసుకురావాలన్నదే ఈ ఒక్క ఛాన్స్ ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో మా ఊరి సినిమా టీమ్ మెంబర్స్ మాచిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పటాన్, రాఘవేంద్రారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రమేష్, రాజు, మురళి పాల్గొన్నారు.

కెసి కెనాల్‌లో నిలిచిన నీరు

ప్రజాశక్తి - చాపాడు

కెసి కెనాల్‌కు అధికారులు సాగునీటిని నిలుపుదల చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ సీజన్‌లో కెసి కెనాల్‌కు ఈ ఏడాది సకాలంలో నీరు విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో వరి పంట సాగు కాలేదు. దీంతో రైతులు రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు మినుము, జొన్న సాగు చేపట్టారు. రైతుల సూచన మేరకు ఆరుతడి పంటలకు 20 రోజులపాటు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం కాలువకు నీటిని నిలుపుదల చేశారు. అయితే పసుపు, ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు ఈ నెల చివరిలో మళ్లీ నీరు విడుదల చేయాల్సి ఉంది. విడతలవారీగా నీటిని విడుదల చేసినా ఇబ్బంది ఉండదని రైతులు పేర్కొంటున్నారు. కెసి కెనాల్ పరిధిలో దువ్వూరు, మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, రాజుపాలెం, చెన్నూరు, వల్లూరు మండలాల పరిధిలో రైతులు ఆరుతడి పంటలను సుమారుగా 65 వేల ఎకరాల్లో సాగు చేపట్టారు. ఖరీఫ్ సీజన్‌లో 15వేల ఎకరాల్లో వరి, పసుపు ఇతర పంటలు సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట నూర్పిడి దశలో ఉంది. ఆరుతడి పంటలకు రెండు విడతలుగా నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న వివిధ రకాల పంటల రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ కోరారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవ సందర్భంగా రైతు సేవా సమితి నియోజకవర్గ సభ్యులతో కలిసి మైదుకూరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవి రమణ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు పడక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయినప్పటికీ, కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోలేదన్నారు. గత వారంలో మిచౌంగ్ తుపాను వల్ల కోత దశకు వచ్చిన పంటలు నీట మునిగి నష్టపోతే రైతుల పంట పొలాల పరిశీలనకు ఇంతవరకు అధికారులు రాకపోవడం దారుణమన్నారు. జిల్లా రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కూడా ఆదుకునేందుకు ముందుకు రాకపోవడం చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు పంటలను ఒక సీజన్ పండించకపోతే తిండి గింజల ధరలు, కూరగాయల, ఆకుకూరల ధరలు పెరిగి ప్రతి ఒక్కరిపై ప్రభావం పడుతుందన్నారు. ప్రభుత్వాలు వెంటనే రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సమితి మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షులు రామాంజనేయులు, పట్టణ అధ్యక్షులు రామ్మోహన్, ఖాజీపేట మండల శాఖ అధ్యక్షులు లక్ష్మయ్య, కత్తి నాగిరెడ్డి పాల్గొన్నారు.

ముంపు గ్రామంగా పరిగణించాలి

కొండాపురం :మండలంలోని కె. సుగుమంచిపల్లె గ్రామాన్ని పూర్తిగా ముంపు గ్రామంగా పరిగణించాలని తె గ్రామ వైసిపి నాయకులు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని కోరారు. గతంలో సుగుమంచిపల్లె గ్రామాన్ని కొంత భాగాం మాత్రమే ముంపునకు తీసుకున్నారని, గత ఏడాది ప్రాజె క్టులో నీరు ఉంచడం వల్ల మిగి లినవారి ఇళ్లలోకి నీటి ఊటలు పెరిగా యన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాన్ని పూర్తిగా ముంపునకు తీసుకోని పరిహారం చెల్లించాలని గ్రామ నాయకులు నాగు ఆదినారాయణరెడ్డి, నాగు అనిమిరెడ్డి, సి ఆదినారాయణరెడ్డి కోరారు. త్వరలో గ్రామానికి న్యాయం చేస్తామని ఎంపీ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.


జనసేనలో చేరిన వారితో శ్రీనివాసరాజు

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి-సిద్దవటం

రాజంపేట జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలు చెందిన యువకులు మహిళలు సుమారు 150 మంది చేరినట్లు శ్రీనివాసరాజు తెలిపారు. ఎస్.ఉప్పరపల్లి లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. పార్టీలో చేరిన వారిని శ్రీనివాసరాజు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికలలో జనసేన విజయదుందుభి మోగించనున్నదని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, ఆకుల చలపతి, పివిఆర్ కుమార్, పత్తి నారాయణ, రామకృష్ణరాజు, రాజా ఆచారి, చిట్టే భాస్కర్, మౌల, సుండుపల్లి నాయకులు చింతల రామకృష్ణ, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలకు చెందిన కట్టా మల్లిఖార్జున, వంశీ, రవి, కదిరి ప్రతాప్ పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణ చేస్తున్న రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు

నీటి అవగాహన పెంపొందకనే 'సీమ'కు నష్టం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పాలకుల ద్రోహంతో పాటు నీటి అవగాహన పెంపొందకనే రాయలసీమ తీవ్రంగా నష్టపోయిందని రాయలసీమ మేధావులు పాణి శ్రీనివాసులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఆదివారము స్థానిక స్త్రీ శక్తి భవన్లో రాయలసీమ విద్యావంతులు వేదిక ఆధ్వర్యంలో సాగునీటి సాధనసమితి అధ్యక్షుడు బొజ్జదశరాంరెడ్డి రచించిన నీటి అవగాహనే రాయలసీమకు రక్ష అనే పుస్తక ఆవిష్కరణ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ పుస్తకావిష్కరణకు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరారెడ్డి ,సిపిఐ కార్యదర్శి రామయ్య, సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ, కాంగ్రెస్ ఇన్‌ఛార్జి నజీర్, జనసేన ఇన్‌ఛార్జి జిలాన్ ,డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి కథ రచయిత దాదా హయత్ , వరలక్ష్మి, జింకా సుబ్రహ్మణ్యంలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ విద్యార్థి శక్తి జిల్లా కన్వీనర్ హరిత అధ్యక్షత వహించారుజ ఈ సదస్సులో ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర నాయకులు సాగునీటిరంగ నిపుణులు శ్రీనివాసులు మాట్లాడుతూ తెలంగాణ వాదులు రాయలసీమకు నీళ్లు రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. ముఖ్యంగా కృష్ణ బేసిన్‌లో రాయలసీమ లేదని పెన్నా బేసిన్ కింద ఉందని వితండ వాదనలు చేస్తూ సీమకు కృష్ణా జలాల్లో నీటి హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. తెలంగాణ వాదనను జగన్ సర్కార్ తిప్పి కొట్టడంలో విఫలమైందని ఆరోపించారు. నాలుగు రాష్ట్రాల మధ్య జరగవలసిన కృష్ణ జలాల పునః పంపిణీ కేవలం తెలంగాణ,ఆంధ్ర రాష్ట్రాల మధ్యనే జరగడం వెనుక కేంద్రం కుట్ర ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో నీటి అవగాహన లేక చాలా నష్టపోయిందన్నారు. దశరథరామిరెడ్డి పుస్తకం వెలువరించడం రాయలసీమ సమాజానికి అవసరమన్నారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యావంతులు వేదిక కో-కన్వీనర్ మహమూద్ ,విరసం మాజీ కార్యదర్శి వరలక్ష్మి, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ ,రాయలసీమ మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి ,సృజనా సామాజిక వేదిక కన్వీనర్ శ్రీనివాస్ రెడ్డి,నాస్తిక సమాజం కన్వీనర్ పల్లవోలు రమణ, రచయితలు పాల్గొన్నారు.

మట్కామాయలో పేదయ కుటుంబాలు..!

పులివెందుల టౌన్ : లక్కు ఉంటే కాసులు.. లేకపోతే బతుకు బస్టాండ్.. మట్కా మా యలో పడుతున్న పేద కుటుంబాలు. సహజంగా సమాజంలో ప్రతి ఒక్క సామాన్యుడికి లక్షాధికారి కావాలనే లక్ష్యం ఉంటుంది. కొందరు కొన్నికొన్ని మార్గాలను ఎంచుకుని సంపదే ధ్యేయంగా పనులు చేసుకుంటారు. మరి కొందరు అతి తక్కువ సమయంలోనే కోటీశ్వరులు కావాలనే ఉద్దేశంతో తప్పుడు మార్గాలను వెతుక్కుంటారు. అప్పులపాలవుతుంటారు. అలాంటిదే మట్కా మహ మ్మారి. ఇందులో బాగుపడినవారికంటే ఆర్థికంగా చితికిపోయినవారే ఎక్కువ. పట్టణం, గ్రామాలు అనే తేడా లేకుండా బీటర్లు మట్కా రాస్తూ సామా న్య ప్రజలను మోసం చేస్తున్నారు. మట్కా బీటర్లు మాత్రం తమ జేబులు నింపుకుం టున్నారు. ఇలాంటి వారిపై పోలీసులు దాడి చేసి కేసులు నమోదు చేసినా మార్పు రాలేదు. ముఖ్యంగా తోపుడు బండ్లు వ్యాపారులు, చిన్నచిన్న వ్యాపా రులు, కూలీలు, పలు వృత్తులవారు అధికంగా మట్కాకు ప్రభావితం అవుతు న్నారు. పొద్దున్నుంచి సాయంత్రం వరకు కష్టపడిన డబ్బులు తగలేస్తున్నారు. అప్పులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. పోలీసులు మట్కా స్థావరాలపై దాడి చేస్తుండంతో.. ఆ స్థావరాలను మూసేసి తమ దూతలను మట్కా రాసే వారి దగ్గరికి పంపుతూ వ్యవహారాన్ని నడుపుతున్నారు. అంతేకాకుండా కూల్ డ్రింక్స్, టీ దుకాణాల్లో కూర్చుని రాస్తున్న వైనం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్థిల్లుతోందని పలువురు పేర్కొంటున్నారు.

ఆర్‌జెయుపి రాష్ట్ర అధ్యక్షునిగా శ్రీనివాసులు

కడప అర్బన్ : రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్తు రాష్ట్ర కార్యవర్గం విస్తృత సమావేశం ఆదివారం మద్రాసురోడ్డులో పసుపులేటి భుజంగరావు ఆర్‌జెయుపి టీచర్స్ హోమ్‌లో కడప జిల్లా ప్రధాన కార్యదర్శి యం.ఓబులరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సంఘం సీనియర్ నాయకులు అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి లింగంపల్లి రవీంద్రనాథ్ బాబు నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన రాష్ట్ర అధ్యక్షునిగా డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు(కడప), ప్రధాన కార్యదర్శిగా యస్.యం.షరీఫ్ (కర్నూలు), గౌరవాధ్యక్షుడు టి.గోపాల్ (తిరుపతి), కార్య నిర్వాహక అధ్యక్షుడు యల్.రవీంద్రనాథ (రాయచోటి), సహాధ్యక్షుడు యం.ఓబులరెడ్డి (కడప), కోశాధికారి గుడిబండ శ్రీనివాసులు (రాయచోటి) ముఖ్యసలహాదారు లుగా ముత్తోజు వీరబ్రహ్మం (నంద్యాల) జి.బాలకృష్ణ (అనంతపురం), ఉపాధ్యక్షులుగా ధర్మరాజు (రాజంపేట), జగన్మోహనాచారి (కర్నూలు), శేషఫణి (నంద్యాల),రెడ్డన్న (రాయచోటి) మహిళా కార్యదర్శులుగా అనసూయాదేవి (కడప),జానకి (చిత్తూరు), స్వయంప్రభలు (కర్నూలు)ను ఎన్నుకున్నారు. తరువాతర జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కడప జిల్లా అధ్యక్షులుగా .ప్రసాదరావు (జడ్పీహైస్కూలు పెండ్లిమర్రి), ప్రధాన కార్యదర్శిగా శీలం పుల్లయ్య (జడ్పీ హైస్కూలు బీ.మఠం), సహాధ్యక్షుడుగా దాడి ఆంజనేయులు (ఒంటిమిట్ట), ఉపాధ్యక్షులుగా సోమలూరి బాబు (జడ్పీ హైస్కూలు లావనూరు), కామేశ్వరరావు (వేంపల్లి) ఎన్నికయ్యారు.

క్రైం కార్నర్

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..మండలంలోని ముష్టూరు గ్రామం గౌనిగారిపల్లి సమీపంలో అదే గ్రామానికి చెందిన శ్రీరాములు అనే వ్యక్తి నాటు సారాను తీసుకువచ్చి అమ్ముతున్నట్లు సమా చారం అందిందన్నారు. ఆ సమాచారం మేరకు ఆదివారం నాటుసారా విక్రయ స్థావరంపై దాడి చేసి శ్రీరాములును అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 12 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో నాటుసార తయారీ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.